

డేంజర్ డాగ్స్..

9లో▸

జిల్లాలోని వివిధ గ్రామాల్లో కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. పగలు రాత్రి అనే తేడా లేకుండా రోడ్లపై పశువులు, గొర్రెలు, మేకలు ఒంటరిగా కన్పిస్తే గుంపులుగా వచ్చి దాడులు చేస్తున్నాయి.

పరీక్ష ఫీజు చెల్లించాలి

నిర్మల్‌ఖిల్లా: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు రెండో సెమిస్టర్ పరీక్ష ఫీజు సకాలంలో చెల్లించాలని నిర్మల్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుధాకర్ సూచించారు. ఈనెల 27వ తేదీ నుంచి వచ్చేనెల 20వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. వివరాలకు అధ్యయన కేంద్రం సమన్వయకర్త యు.గంగాధర్‌ను నేరుగా లేదా 7382929703 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.4 /24.4

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేజీబీవీల్లో వసతులు కల్పించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: కస్తూరిబాగాంధీ విద్యాలయాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కేజీబీవీ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, విద్యాశాఖ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేజీబీవీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల ప్రాంగణాలలో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, ఫ్యాన్స్ వంటి పనులు, మరమ్మత్తులు పూర్తి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులను నిర్వహించి, నైపుణ్యాలు పెంచాలని సూచించారు. సమావేశంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత జిల్లాగా మారుద్దాం

- డీఎంహెచ్‌వో రాజేందర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌ను ఎయిడ్స్ రహిత జిల్లాగా మారుద్దామని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. కలెక్టరేట్‌లో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు, ఏఎన్‌ఎంలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్‌ను నివారించేందుకు అవగాహన, ముమ్మరంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. హెచ్ఐవీ బాధితులకు మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వారి జీవిత కాలాన్ని పెంచడానికి అవకాశం ఉందన్నారు. బాధితులపై వివక్ష చూపొద్దని వారికే మానసిక ధైర్యాన్ని అందించాలని తెలిపారు. హెచ్ఐవీ నివారణలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ నాగరాజు, పీవో డాక్టర్ రాజారమేష్, జిల్లా మాస్ మీడియా అధికారి బారె రవీందర్, సంతోష్, ఐసీటీసీ కౌన్సిలర్లు సుదర్శన్, శ్రీనివాస్, రామచంద్ర పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వంటావార్పు



వంటావార్పులో పారిశుధ్య కార్మికులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ మున్సిపాలిటీలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు పెండింగ్ వేతనాల కోసం చేపట్టిన విధుల బహిష్కరణ నాలుగో రోజు గురువారం కూడా కొనసాగింది. జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్‌లో వంటావార్పు నిర్వహించారు. అక్కడే భోజనాలు చేశారు. మూడు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నామని తెలిపారు. పెండింగ్ వేతనం చెల్లించే వరకు విధులు బహిష్కరిస్తామని స్పష్టం చేశారు.

దొంగా.. పోలీస్..!



- జిల్లాలో రెచ్చిపోతున్న చోరులు
- రోజుకో అరెస్టు చూపుతున్న ఖాకీలు
- మహిళలను హడలెత్తిస్తున్న చైన్‌స్నాచర్లు
- పోలీసులకు సవాల్‌గా వరుస ఘటనలు
- తాజాగా భైంసాలో గొలుసు దొంగతనం



బాసరలో చోరీకి పాల్పడిన దొంగను అరెస్టు చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీషర్మిల



బాసరలో చోరీకి వచ్చిన దొంగ (ఫైల్)

భైంసాటౌన్: జిల్లాలో దొంగా పోలీస్ ఆట సాగుతున్నట్లుగా ఉంది పరిస్థితి. పోలీసులు రెండు మూడు రోజులకో దొంగను అరెస్టు చూపుతున్నారు. మరోవైపు దొంగలు కూడా రెండు మూడు రోజులకో చోట దొంగతనం చేస్తున్నారు. పట్టుకోండి చూద్దాం అన్నట్లు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. నెల రోజులుగా జిల్లాలో ఏదో ఒక చోట చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఈ వరుస ఘటనలు ప్రజలను కలవరపెడుతున్నాయి. రాత్రిళ్ల ఇళ్లు, దుకాణాల్లో.. పగలు మహిళ మెడల్లోని గొలుసులు దొంగతనాలు చేస్తున్నారు. మరోవైపు పోలీసులు దొంగలను పట్టుకుంటున్నా.. చోరీలు మాత్రం ఆగడం లేదు. వారం వ్యవధిలో భైంసా పట్టణంలోనే రెండు చోరీలు, రెండు చైన్ స్నాచింగ్‌లు జరిగాయి. రెండురోజులక్రితం జిల్లాకేంద్రంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడగా, తాజాగా గురువారం భైంసాలో చైన్‌స్నాచర్లు రెచ్చిపోయారు. రెండు రోజుల క్రితం నిర్మల్‌లో ఒక ఇంట్లో, బార్‌లో దొంగతనం జరిగింది. దీంతో ఎప్పుడు, ఎవడు, ఎక్కడి నుంచి వచ్చి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్తారో అని మహిళలు హడలెత్తిపోతున్నారు. పోలీసులకు సవాల్ విసురుతున్నట్లుగా దొంగలు చోరీల పరంపర కొనసాగించడం ఆందోళన కలిగిస్తోంది.

భైంసాలో వరుస ఘటనలు..

దాదాపు ఏడాదికిందట భైంసాకు చెందిన ఓ వివాహిత నిర్మల్ నుంచి భైంసాకు వస్తుండగా, బస్సులో ఎక్కిన కొందరు మహిళలు ఆమె ముఖంపై పౌడర్‌లాంటిది చల్లి, ఆమె వద్ద ఏడు తులాల బంగారు గొలుసు అపహరించారు. ఈ విషయం ఆమె ఇంటికి వచ్చిన తరువాత తెలియడంతో ఆమె భైంసాలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొద్దినెలల కిందట ఓ వ్యక్తి బెల్‌తరోడ నుంచి బైక్‌పై కుంటాల వైపు వెళ్తుండగా పట్టణంలోని జియో పెట్రోల్ పంప్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు వెంబడించి ముఖంపై పౌడర్‌లాంటిది చల్లి ఆయన వద్ద నుంచి బంగారు గొలుసు, నగదు అపహరించారు. ఇది జరిగిన కొద్దిరోజులకే వానల్‌పాడ్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, మాటేగాం టోల్‌ప్లాజా వద్ద అడ్రస్ అడుగేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ఆపి ముఖంపై పౌడర్‌లాంటిది చల్లి నగదు అపహరించారు. కొద్దిరోజుల కిందట పట్టణంలోని పద్మావతి కాలనీలో రెండు స్వర్ణకార దుకాణాల్లో షటర్ పగులగొట్టి భారీగా బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఇలా వినూత్నంగా దొంగతనాలకు పాల్పడుతుండడంతో జనాలు ఆందోళన చెందుతున్నారు. తాజాగా మహిళల మెడలో నుంచి గొలుసు దొంగతనాలు జరుగడంతో ఆభరణాలతో బయటకు రావాలంటేనే జంకుతున్నారు.

దొంగతనాల నియంత్రణకు చర్యలు..

దొంగతనాల నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. చైన్‌స్నాచింగ్ ఘటనల్లో నేరస్తుల గుర్తింపు కోసం సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నాం. మహిళలు, ప్రజలు ఆందోళన చెందవద్దు. మరింతగా పోలీస్ పెట్రోలింగ్ పెంచి, దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌ల అడ్డుకట్టకు చర్యలు తీసుకుంటాం.

– అవినాష్ కుమార్, ఏఎస్పీ, భైంసా

భైంసాలో రెచ్చిపోయిన చైన్‌స్నాచర్లు..

భైంసాటౌన్: పట్టణంలో చైన్‌స్నాచర్లు రెచ్చిపోయారు. ఒకేరోజు ఇద్దరు మహిళల మెడలో నుంచి గొలుసు దొంగతనాలకు యత్నించగా, ఓ మహిళ తప్పించుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గోకుల్‌నగర్‌కు చెందిన రజిత నడుచుకుంటూ వెళ్తుండగా, కమల థియేటర్ సమీపంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో నుంచి గొలుసు లాక్కెళ్లేందుకు యత్నించారు. దీంతో అప్రమత్తమైన మహిళ చైన్ గట్టిగా పట్టుకోవడంతో చిన్న చైన్‌తోపాటు మంగళసూత్రం కొద్ది భాగం(రెండున్నర తులాలు) ఎత్తుకెళ్లారు. ఇదిజరిగిన కొద్ది నిమిషాల ముందు మేదరిగల్లిలో రాణి అనే మహిళ బీడీ కంపెనీకి వెళ్తుండగా, బైక్‌పై వచ్చిన ఇదే ఇద్దరు దుండగులు చైన్ లాగేందుకు యత్నించారు. ఆమె గట్టిగా పట్టుకోవడంతో తప్పించుకుంది. ఒకేరోజు రెండుచోట్ల చైన్ స్నాచింగ్ జరగడం స్థానికంగా కలకలం రేపింది. బాధితురాలు రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఎండీ గౌస్ ద్దీన్ తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఆగస్టులో దొంగతనాలు..

- ఈనెల 3న భైంసాలోని రాహుల్‌నగర్‌కు చెందిన లక్ష్మి బస్సు దిగి కాలనీలోని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా, నంబర్ ప్లేట్ లేని బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు మహిళ మెడలో నుంచి రెండుతులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. దుండగులు ముఖానికి కర్చీఫ్ కట్టుకుని దర్జాగా బైక్‌పై పారిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి.
- ఈనెల 11న నిర్మల్ పట్టణంలోని చింతకుంట వాడ కాలనీకి చెందిన లింగయ్య ఇంట్లో ఇద్ద రు మహిళలు చోరీకి యత్నించారు.
- 13న నర్సాపూర్ మండలంలోని తురాటి గ్రామానికి చెందిన లింగవ్వ నడుచుకుంటూ వెళ్తుండగా, బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు.
- ఈనెల 14న రాత్రి బాసర ఆలయంలో దొంగతనం జరిగింది. హుండీని పగులగొట్టి రూ.14 వేల నగదు అపహరించాడు. సీసీ కెమెరాలు ధ్వంసం చేశాడు.
- ఈనెల 18న నిర్మల్ పట్టణంలోని సోమవార్ పేట్‌కు చెందిన ఇంట్లో చోరీ జరిగింది. ఇందులో 2 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.48 వేల నగదు ఎత్తుకెళ్లారు.
- 19న నిర్మల్ పట్టణం గాజుల్‌పేటకు చెందిన రవి ఇంట్లో చోరీ జరిగింది. 15 గ్రా ముల బంగారం, 15 తులాల వెండి ఎత్తుకెళ్లారు.
- ఈనెల 23న జిల్లాకేంద్రంలో వేర్వేరుగా మహిళల మెడలో గొలుసు చోరీలు జరిగాయి. మ యూరి హోటల్ సమీపంలో, శాస్త్రినగర్‌లో మ రో మహిళ నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లా రు. ఇలా పట్టపగలే రెండు ఘటనలు జరుగడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు.
- ఈనెల 23న ముధోల్‌లోని వెంకటేశ్ ఇంట్లో దొంగతనం జరిగింది. తాళం వేసి ఊరికి వెళ్లడంతో ఇంట్లో దొంగలు పడి రూ.1.6 లక్షల నగదు, 7 తులాల బంగారం ఎత్తుకెళ్లారు.
- ఈనెల 25న ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్‌లో నివాసం ఉంటున్న ప్రైవేటు ఉపాధ్యాయుడు శంకర్ ఇంట్లో చోరీ జరిగింది.
- 26న జిల్లాకేంద్రంలోని ద్యాగవాడకు చెందిన నాగమ్మ బట్టలు ఉతికేందుకు వెళ్తుండగా, బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలో నుంచి తులంన్నర బంగారు గొలుసు లాక్కెళ్లారు.
- ఈనెల 27న జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో ఉన్న వైష్ణవి బార్‌లో దొంగతనం జరిగింది. రూ.30 వేల నగదు, రూ.5 వేల విలువైన మద్యం ఎత్తుకెళ్లారు.

అరెస్టులు..

- సారంగాపూర్ మండలం బీరవెల్లికి చెందిన ఒన్నె సుధాకర్ ఇంట్లో చోరీకి పాల్పడి న దొంగ ఇప్ప పరమేశ్వర్‌నుఆగస్టు 8న పోలీసులు అరెస్టు చేశారు. బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.
- ఈనెల 9న భైంసా పోలీసులు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన దొంగ కొతేకర్ రాజును అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.10 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.
- ఈనెల 10న నిర్మల్ బస్టాండ్‌లో ఇద్దరు దొంగలను నిర్మల్ పోలీసులు అరెస్టు చేశారు. రాపాని శ్రీను, సుజాత, రాజమణిని అరెస్టు చూపారు.
- బాసర ఆలయంలో చోరీకి పాల్పడిన దొంగ నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం నందిగావ్‌కు చెందిన కొసిడిగా సాయికుమార్‌ను ఈనెల 19న పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.6 వేల నగదు, రూ.6400 విలువైన సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 27న నిర్మల్ పోలీసులు అంతరాష్ట్ర దొంగ హర్యానాకు చెందిన మహ్మద్ అబ్బాస్‌ను అరెస్ట్ చేశారు.
- ఈనెల 23న ముధోల్‌లోని వెంకటేశ్ ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో పోలీసులు ఈనెల 26న దంపతులను అరెస్టు చేశారు. ఇంట్లో అద్దెకు ఉన్నవారే చోరీ చేశారు.

పల్లె పోరుకు సమాయత్తం కావాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి

నిర్మల్‌చైన్‌గేట్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమాయత్తం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈఓలు, డీపీఓలు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లను పగడ్బందీగా చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఎన్నికల నిర్వహణకు ప్రతీ వార్డుకు ఒక పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి 650 ఓటర్లు మించిన వార్డులలో రెండో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మూడు దశలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, చివరగా మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. అజాగ్రత్తకు తావివ్వకుండా, ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని వివరించారు. సెప్టెంబర్ 6న ఓటరు జాబితా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వెలువరించి అభ్యంతరాలు స్వీకరించాలని, సెప్టెంబర్ 21న తుది ఓటరు జాబితా విడుదల చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసే అధికారం కేవలం ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ చట్టం-2018 తో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలపై పూర్తి అవగాహన కలిగివుండాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వారీగా రూపొందించుకోవాలని తెలిపారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. ఎంపిడిఓలు తమ తమ మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి వాటి స్థితిగతులను పరిశీలించాలని, ప్రతీ పోలింగ్ కేంద్రం పరిధిలో 600 వరకు ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల సంఖ్య 650 దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. ఒక వార్డులోని ఓటరుకు మరో వార్డులో ఓటు హక్కు ఉండకుండా జాగ్రత్త వహించాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రిని సమకూర్చుకోవాలని, ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన పోలింగ్ సిబ్బందిని గుర్తించి, వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలలో విధులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈమేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గణేశ్ ఉత్సవాల నిర్వహణపై ఎస్పీ జానకీషర్మిలతో కలిసి ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో గురువారం శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాలలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతీ గణేశ్ మండపం వద్ద విద్యుత్, జనరేటర్ సౌకర్యం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పట్టణ ప్రధాన వీధుల గుండా రహదారులకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. నిర్మల్ పట్టణం బంగల్‌పేట్ చెరువు వద్ద, భైంసా పట్టణంలో గడ్డన్న వాగు ప్రాజెక్టు వద్ద బారికేడ్లు, క్రేన్లు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

శాంతియుతంగా జరుపుకునేలా..

ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో వినాయక ఉత్సవాలు ఘనంగా, శాంతియుతంగా జరుపుకునేలా పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతీ గణేశ్ మండపం వద్ద సీసీ కెమెరాలతోపాటు నిరంతరం పోలీస్ బందోబస్తు, వాలంటీర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అధికశబ్దం వచ్చే డీజేలకు అనుమతి లేదన్నారు. పోలీసులకు ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. బెల్ట్ షాపులను మూసివేసేలా పోలీసు, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. శోభాయాత్ర సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మొబైల్ టాయిలెట్స్, అంబులెన్స్, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీఆర్వో భుజంగరావు, ఆర్డీవోలు కోమల్‌రెడ్డి, రత్న కళ్యాణి, డీఎస్పీ గంగారెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్, నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు రాజు, రాజేశ్‌కుమార్, మనోహర్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం

- ప్రభుత్వ ఉద్యోగులకు ఆటల పోటీలు
- ప్రారంభించిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో జాతీయ క్రీడాదినోత్సం గురువారం నిర్వహించారు. భారత హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ప్రారంభించారు. ఉద్యోగులను పరిచయం చేసుకున్నారు. అంతకుముందు విజయ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ అందరినీ ఆకట్టుకుంది. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని క్రీడాకారులు ఆటల్లో ప్రతిభ కనబర్చాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. అనంతరం క్రీడల్లో పాల్గొన్న ఉద్యోగులకు అవార్డులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఒలింపిక్స్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీధర్, సీనియర్ క్రీడా అధికారి శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఫైజాన్ అహ్మద్, శ్రీకాంత్ రెడ్డి

క్రీడలపై ఆసక్తి చూపాలి

నిర్మల్‌టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని డీఎస్పీ గంగారెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలో అక్షయ్ తైక్వాండో అకాడమీ క్యాంప్‌ను గురువారం ప్రారంభించారు. క్రీడలతో పోటీతత్వం పెరుగుతుందని, మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల్లో క్రీడల కోటలో ఉద్యోగాలు సంపాదించుకోవచ్చని పేర్కొన్నారు. అకాడమీ స్థాపించిన అక్షయ్‌ను అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో జాతీయ క్రీడాకారుడు ద్యయాత్ అక్షయ్, తైక్వాండో క్రీడా సంఘం జిల్లా అధ్యక్షుడు సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వివిధ క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కలెక్టర్ అభిలాష అభినవ్

క్రీడల్లో రాణించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో బహుమతులు ప్రదానం చేశారు. ప్రతి విద్యార్థి తమకు ఇష్టమైన ఆటను ఎంచుకొని అందులో ప్రతిభ చూపాలన్నారు. క్రీడల వలన శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసా కలుగుతుందన్నారు. అనంతరం క్రీడాకారులను కలెక్టర్ శాలువాతో సత్కరించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, వివిధ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూడైస్ ప్లస్‌లో వివరాలు నమోదు చేయాలి

- డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: పాఠశాలల వివరాలు యూడైస్ ప్లస్‌లో పక్కాగా నమోదు చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. ఎంఈవోలు, మండల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీసీవోలు, సీఆర్పీలకు సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో యూ డైస్ ప్లస్‌పై గురువారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల వివరాలు, సౌకర్యాలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మొదలగు వివరాలు సెప్టెంబర్ 15లోపు పక్కగా నమోదు చేయాలని సూచించారు. పాఠశాలల ప్రగతికి యూడైస్ ప్లస్‌లోని వివరాలు ముఖ్యమన్నారు. యూడైస్ ప్లస్ పోర్టల్ నుంచి పాఠశాలల డీసీఎఫ్(డేటా క్యాప్చర్ ఫార్మాట్) లను డౌన్లోడ్ చేసుకొని, వివరాలను సరిచూసుకొని, ఏవైనా మార్పులు ఉంటే సరిచేసి, సరి చేసిన డీసీఎఫ్‌లను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయునికి అందించాలన్నారు. వారు తమ పరిధిలోని అన్ని పాఠశాలల డీసీఎఫ్ వివరాలను సరిచూసి సంబంధిత ఎంఈవోలకు అందించాలన్నారు. అలాగే మండల విద్యాధికారి తమ మండల పరిధిలోని 25 శాతం పాఠశాలలను ఎంపిక చేసుకొని ఆ పాఠశాలల నమోదు వివరాలు సరి చూసి డీఈవో కార్యాలయంలో అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రతీరోజు విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్, ఎండీఎం అటెండెన్స్ తదితర వివరాలను ఉదయం 12 గంటలలోపు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పరీక్షల సహాయ కమిషనర్ పద్మ, జిల్లా ప్లానింగ్ సమన్వయకర్త రాజేశ్వర్, ఏపీవో హరీశ్, జిల్లా విలీన విద్య సమన్వయకర్త ఎన్.ప్రవీణ్‌కుమార్, ఏఎస్‌సీ లింబాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

క్లుప్తంగా

బాసరలో హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు

బాసర: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీ కానుకలను గురువారం ఆలయ అధికారులు లెక్కించారు. అక్షరాభ్యాస మండపంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమైన లెక్కింపు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. 79 రోజుల హుండీ ఆదాయం రూ.99,17,200, మిశ్రమ బంగారం 116 గ్రాములు, మిశ్రమ వెండి 4,700 గ్రాములు, విదేశీ కరెన్సీ 35 నోట్లు వచ్చాయని ఈవో విజయరామారావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్ తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థాన వైదిక పరిపాలన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోలీసుల సిబ్బంది, దేవస్థాన వాగ్దేవి సొసైటీ, శివ రామ కృష్ణ భజన మండలి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

సీఎంకు బహిరంగ లేఖ



లేఖ విడుదల చేస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన జరిగేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డికి మానవ హక్కుల వేదిక జిల్లా కమిటీ తరఫున గురువారం బహిరంగ లేఖ రాసిందని జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతీష్ కుమార్ తెలిపారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీలు అమలు చేయడంతోపాటు రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గత తొమ్మిది నెలలుగా రాష్ట్రంలో ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. పోలీసు స్టేషన్‌లో దొంగతనం పేరిట బలహీన వర్గాల వారిని, మహిళలను చిత్రహింసలకు గురిచేస్తున్నారని తెలిపారు. సభ్యులు సూరజ్, రాహుల్, దివ్య, నిఖిత, మౌనిక, రజిత, సంధ్య, ఆర్తి తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కలిసిన డీసీసీ చీఫ్



డీజీపీకి బొకే అందజేస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్‌ను హైదరాబాద్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌ను కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించారు.

పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌ను కలిసిన 'పత్తిరెడ్డి'



శుభాకాంక్షలు తెలుపుతున్న పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డిని జెడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జలపాతాలకు నిలయమని, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించడానికి రావాలని ఆహ్వానించారు.

'కడెం' సందర్శన



ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న అన్వేశ్‌రెడ్డి

కడెం: రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుంకెట అన్వేశ్‌రెడ్డి గురువారం కడెం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ప్రభుత్వ నిధులతో చేపట్టిన మరమ్మతులను పరిశీలించారు. ప్రాజెక్ట్ నీటి మట్టం, ఆయకట్టు తదితర అంశాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్, సీడ్ కార్పొరేషన్ అధికారులు, తదితరులు ఉన్నారు.

సింగరేణిలో చెత్తశుద్ధి

- రూ.1.15 కోట్లతో శ్రీరాంపూర్‌లో ప్లాంటు ఏర్పాటు
- కంపెనీలోనే మొదటిది
- రేపు డెప్యూటీ సీఎం చేతుల మీదుగా ప్రారంభం!
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



సీసీసీలో ఏర్పాటు చేసిన సింగరేణి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణ కోసం మరో ముందడుగు వేసింది. ఇన్నాళ్లు కాలనీల్లో నుంచి వచ్చే చెత్త, వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో పారబోసేది. దీనివల్ల నేల, గాలి, నీరు కాలుష్యమయ్యేది. దీనికి ఇక చెక్ పెట్టాలనే ఉద్దేశంతో కంపెనీ మొదటిసారిగా చెత్తను ప్రాసెస్ చేసే ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. పైలట్ ప్రాజెక్టు కింద శ్రీరాంపూర్ ఏరియా పరిధి సీసీసీలోని సీఐఎస్‌ఎఫ్ క్లాం ఫ్లెక్స్ ఆవరణలో సింగరేణి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయగా రూ.1.15 కోట్లు వెచ్చించింది. ప్లాంట్ సామర్థ్యం 25 టన్నులు కాగా, ఎకరంలో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. వేస్టేజ్ కలెక్షన్ సెక్షన్, ట్రోమల్ మిషన్, ఫట్కా మిషన్, బాయిలింగ్ మిషన్, కోకోనట్ ష్రెడ్డర్ మిషన్, యంత్రాలకు అనుసంధానం చేసే కన్వేయర్ బెల్ట్ సిస్టం పూర్తయింది.

తడి,పొడి వేరుచేసి..

శ్రీరాంపూర్ ఏరియాలోని కాలనీల నుంచి నిత్యం 20 టన్నుల చెత్తవెలువడుతుంది. ఇప్పటివరకు ఈ చెత్తను సీసీసీలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వెనుకాల ఉన్న కంపెనీ ఖాళీ స్థలంలో పారబోసేవారు. ఇక నుంచి ఈ ప్లాంట్‌కు తరలిస్తారు. ముందుగా తడి, పొడి చెత్తను వేరుచేస్తారు. వీటిని ప్రాసెస్ కోసం ప్రత్యేక యంత్రాలున్నాయి. శుద్ధీ కరణ తర్వాత వచ్చే వ్యర్థపదార్థాల నుంచి బై ప్రొడక్ట్స్‌ను తయారీకి పరిశోధనలు చేస్తున్నారు. పొడి చెత్తను యంత్రాల్లో కాల్చివాటి నుంచి ఘన రూపంలో ప్లాస్టిక్ వ్యర్థాన్ని తీస్తారు. భవిష్యత్తులో దీన్ని నుంచి ప్లాస్టిక్ టైల్స్ తయారు చేసే ఆలోచనలో కంపెనీ ఉంది. ఇక తడి చెత్త శుద్ధి తర్వాత వచ్చే వ్యర్థాల నుంచి ఎరోబిక్ కంపోస్టు తయారీకి సన్నాహాలు చేస్తున్నారు. ఈ బై ప్రొడక్ట్స్‌పై పరిశోధనల తర్వాత అప్పుడు వీటిని తయారు చేస్తారు.

రేపు డెప్యూటీ సీఎం రాక?

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్లాంట్‌ను యాజమాన్యం డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేసింది. శనివారం ఆర్జీ–1 ఏరియాలో డెప్యూటీ సీఎం కార్యక్రమం ఉంది. అక్కడ నుంచి ఆయన చెన్నూర్‌లో 11 కేవీ సోలార్ ప్లాంట్ ప్రారంభానికి డెప్యూటీ హాజరవుతారు. సమయం ఉంటే అదేరోజు మధ్యాహ్నం ఈ ప్లాంట్‌ను ఆయనతో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అనుకున్న ప్రకారం డెప్యూటీ సీఎం కార్యక్రమం జరిగితే మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, ప్రజాప్రతినిధులతోపాటు కంపెనీ సీఎండీ బలరాం నాయక్, డైరెక్టర్లు యన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, ఏరియా ఇన్‌చార్జీ జీఎం టి.శ్రీనివాస్, అధికారులు హాజరుకానున్నారు. ఇందుకోసం ఏరియా జీఎం, సివిల్ డీజీఎం ఆనంద్‌కుమార్, పర్సనల్ డీజీఎం అరవిందరావు అధికారులతో తగిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

హ్యాపీ స్పోర్ట్స్ డే ఆకారంలో విద్యార్థులు



బేల: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొని సందడి చేశారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులు హ్యాపీ స్పోర్ట్స్ డే ఆకారంలో కూర్చున్నారు. వైస్ ప్రిన్సిపాల్ హరికృష్ణ, పీఈటీ శివన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గిడుగు' జాతీయ సాహితీ పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న కవులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకు చెందిన నలుగురు కవులకు 'గిడుగు జాతీయ సాహితీ పురస్కారాలు దక్కాయి. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిడుగు జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ భీమేశ్‌కు కవిత్వం విభాగంలో స్వేచ్ఛకు సంకెళ్లు పుస్తకానికి, తుమ్మల దేవరావ్ రాసిన మట్టిపాదాలు కవితాసంపుటికి పురస్కారాలు దక్కాయి. గిడుగు జాతీయ కళా సేవారంగంలో నేరెళ్ల హనుమంతు, తొడిశెట్టి పరమేశ్వర్‌కు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ సాహిత్యం–వెబ్ సైట్ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్, ప్రముఖ కవి బిక్కి కృష్ణ, తెలుగు వన్ నిర్మాత కంఠమనేని రవిశంకర్, ఆంధ్రప్రభ సంపాదకుడు వైఎస్ఆర్ శర్మ, విమల సాహితీ అధ్యక్షుడు డా.జల్ది విద్యాధర్, శంకరం వేదిక అధ్యక్షురాలు యలవర్తి ధనలక్ష్మి, ఫౌండేషన్ అధ్యక్షురాలు కాంతికృష్ణ పాల్గొన్నారు.

పర్సు పోగొట్టుకున్న మహిళ

- అప్పగించి నిజాయతీ చాటుకున్న చిరువ్యాపారి



సయ్యద్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ఎస్సైలు ప్రదీప్, గౌసుద్దీన్

భైంసాటౌన్: పట్టణానికి చెందిన ఓ మహిళ తన పర్సుతోపాటు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా కూరగాయలు విక్రయించే చిరువ్యాపారికి లభించడంతో పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. పట్టణంలోని కిసాన్‌గల్లికి చెందిన సరోజ తన భర్త సురేశ్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా, కూరగాయల మార్కెట్ వద్ద పర్సు పోగొట్టుకుంది. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సీసీ కెమెరా పరిశీలిస్తుండగా, తనకు పర్సు దొరికిందని కూరగాయల వ్యాపారి సయ్యద్ అహ్మద్ అక్కడికి వచ్చి అప్పగించాడు. రూ.14వేల నగదుతోపాటు సెల్‌ఫోన్ ఉన్న పర్సును ఎస్సైలు ప్రదీప్, ఎండీ గౌసుద్దీన్ గురువారం బాధిత మహిళకు అందించారు. నిజాయతీ చాటుకున్న చిరువ్యాపారిని సన్మానించారు.

వైన్స్ షాపుల్లో చోరీకి పాల్పడిన నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్

నిర్మల్‌టౌన్: కొన్నిరోజులుగా వైన్స్ షాపుల్లో చోరీకి పాల్పడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఈ మేరకు వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ కాలనీకి చెందిన రాఫెన్వాడ్ రఘు, ఉత్తం పాండురంగ పవర్, మక్కల శీను, జాదవ్ దిలీప్, రాపని సోనిలు కూలీ పనిచేస్తున్నారు. వాటితో వచ్చే డబ్బులతో జల్సా చేయడంతోపాటు మద్యం తాగేవారు. జల్సాలకు డబ్బు సరిపోక శ్రీ వెంకటేశ్వరరావు, సిరి వైన్స్ షాపుల్లో చోరీ చేశారు. ఈనెల 27న సాయి వైష్ణవి బార్ అండ్ రెస్టారెంట్ షటర్ తాళాలు రాడ్లతో పగులగొట్టారు. సీసీ కెమెరాలు, టీవీని ధ్వంసం చేసి, కౌంటర్‌లో రూ.40 వేల నగదు, ఒక కంప్యూటర్, కొన్ని మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. బార్ యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీఎస్ పోలీసుల సహకారంతో 24 గంటల్లో నలుగురిని అదుపులో తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మరొకరు పరారీలో ఉన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు సాయికృష్ణ, రవి, రమేశ్, కానిస్టేబుల్ తిరుపతి, గణేశ్, హోంగార్డు సతీశ్‌లను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

పక్షవాతంతో భార్యను చూడలేక భర్త ఆత్మహత్య

బోథ్: పక్షవాతంతో బాధపడుతున్న భార్యని చూడలేక మనోవేదన చెందిన భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని కనుగుట్టలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం..గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకుల నడిపెన్న(80) భార్య ఆకుల లక్ష్మి గత కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతోంది. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైంది. పక్షవాతం బారిన పడిన భార్యను చూసి కొన్ని రోజులుగా తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. పెద్ద కుమారుడు రాజేందర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన సోహెల్ ఖాన్ ఈనెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో తండ్రి ఉమర్ ఖాన్ గురువారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి, కూతురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని పంజేష మొహల్లాకు చెందిన తల్లి, కూతురు పిన్నంవార్ చిట్టి, మనస్వితలు బుధవారం ఇంటి నుంచి రైల్వే స్టేషన్ వైపు కాలినడకన వెళ్తున్నారు. వెనుక నుంచి ఒకరు బైక్‌పై వచ్చి ఢీకొట్టడంతో వారికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని రిమ్స్‌కు తరలించారు. ఆమె భర్త శ్రీనివాస్ గురువారం ఫిర్యాదు చేయగా, ఎస్సై విష్ణు ప్రకాశ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఖానాపూర్: పట్టణంలోని లారీఅడ్డా ప్రాంతంలో బైక్‌ను వెనుక నుంచి ఆర్టీసీ బస్సు గురువారం ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి స్వల్ప గాయంతో ఇరువురు ఒకరినొకరు విమర్శించుకొని రోడ్డుపై కాసేపు గొడవపడ్డారు. కాగా, బస్సు డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, రోడ్డు ప్రమాద బస్సు, బైక్ ఢీకొన్న చిత్రాలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. పట్టణంలోని రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతోనే తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాద ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై లింబాద్రి తెలిపారు.

ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భుక్తాపూర్‌లో ఈనెల 27న రాత్రి జరిగిన దొంగతనం కేసులో మరో నిందితుడిని పోలీసులు గురువా రం పట్టుకున్నారు. అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరి మృతి

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన మునుగూరి వెంకటేశ్ (60) ప్రమాదవశాత్తు సదర్మాట్ కాలువ బ్రిడ్జి పై నుంచి పడి మృతిచెందాడు. ఎస్సై లింబాద్రి కథనం ప్రకారం..గురువారం శివాజీనగర్–అంబేద్కర్‌నగర్ మధ్యలో గల కాలువపై రోడ్డు పక్కన బ్రిడ్జిపై వెంకటేశ్ కూర్చున్నాడు. ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. గమనించిన కాలనీవాసులు అతన్ని బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి అన్నకుమారుడు భూమేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన గోవింద్ సర్కార్(24) బతుకుదెరువు కోసం నిర్మల్ జిల్లాకు వచ్చాడు. కూలీగా వరినాట్లు వేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 23న వరినాట్ల డబ్బుల కోసం బైక్‌పై కడెంకు వెళ్లి తిరిగివస్తున్నాడు. లక్ష్మణచాంద మండలం నర్సాపూర్–ఒడ్డెపెల్లి జాతీయ రహదారి పక్కన మొక్కజొన్న కంకులు కొనుగోలు చేస్తుండగా అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. క్షతగాత్రుడిని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ ఇప్ప ముత్యంరెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ముత్యంరెడ్డి

నిర్మల్‌ఖిల్లా: భవన నిర్మాణ, ఇతర అసంఘటితరంగ కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక, సామాజిక భద్రతను పొందాలని ఆదిలాబాద్ జిల్లా కార్మిక శాఖా సహాయ కమిషనర్ ఇప్ప ముత్యంరెడ్డి సూచించారు. భవన నిర్మాణరంగం, ఫారెస్ట్, బీడీ కార్మికులకు కార్మిక చట్టాలు, సామాజిక భద్రత పథకాలపై పీఎం విశ్వకర్మ కేంద్రంలో శిక్షణ పొందుతున్న పలు రంగాల కార్మికులకు గురువారం ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణరంగ కార్మికులకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పని ప్రదేశాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని, తప్పని సరిగా లేబర్ బోర్డ్ నుంచి గుర్తింపు కార్డును కలిగి ఉండాలని తెలిపారు. నిర్మల్ సహాయ కార్మిక అధికారి రాజలింగం మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం కేంద్రం ఇప్పటికే ఈ శ్రమ్ పథకం, మన్‌దన్ యోజన అమలు చేస్తోందని తెలిపారు. కనీస వేతనాల అమలుకోసం చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భైంసా సహాయ కార్మిక అధికారి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలన కోసం అందరూ కలిసి రావాలన్నారు. ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వదేశ్ పరికిపండ్ల మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లా నుంచి కార్మికులు దుబాయ్, మస్కట్, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌కు వలస వెళ్తున్నారన్నారు. విదేశాలకు వెళ్లేవారు ముందుగా శిక్షణ పొంది, లేబర్ కాంట్రాక్ట్ ప్రకారం వేతన సౌకర్యాలు, కంపెనీ వివరాలు పక్కగా తెలుసుకుని వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ ట్రైనింగ్ మేనేజర్ మోతె రాజు, దుర్గం శ్రీకాంత్, యూనియన్ నాయకులు కొమ్ము గీత, తాళ్ల సంజీవ్, శిక్షణ పొందుతున్న కార్మికులు పాల్గొన్నారు.

నెమలిని కాపాడిన రైతు



అటవీఅధికారులకు నెమలిని అప్పగిస్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్ శివారులో జాతీయ పక్షి నెమలిని కుక్కలు గురువారం రాత్రి వెంబడించాయి. రైతు సురుకుంట వినోద్‌రెడ్డి గమనించి కాపాడాడు. గాయపడిన నెమలి గురించి వీడీసీ అధ్యక్షుడు వెంకట్‌కు వివరించాడు. స్పందించిన ఆయన అటవీ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎఫ్ఎస్‌వో అలేఖ్య, ఎఫ్‌బీవో సాయరెడ్డిలు నెమలికి ప్రాథమిక చికిత్స అనంతరం అటవీప్రాంతంలో వదిలేశారు. నెమలిని కాపాడిన రైతును అటవీ అధికారులు అభినందించారు.

క్రీడాకారుడికి ప్రశంస..

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకు చెందిన క్రీడాకారుడు జాదవ్ ఉమేశ్ జాతీయస్థాయి క్రికెట్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఉమేశ్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రశంసాపత్రం, మెమొంటో అందించారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ

భైంసారూరల్: కుటుంబ నిర్ధారణ, రేషన్‌కార్డు, ఇతర కారణాలతో రూ.2 లక్షల లోపు రుణమాఫీకాని రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.మండలంలోని హంపోలి క్లస్టర్ పరిధిలో రైతువేదికలో ప్రత్యేక కార్యక్రమం గురువారం ఏర్పాటుచేశారు. రుణమాఫీ వర్తించని రైతులు ఇచ్చిన ఫిర్యాదులను తీసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఏడీఏ వీణ రైతువేదికకు వచ్చి రైతులతో మాట్లాడారు. నోడల్ అధికారుల ఆధ్వర్యంలో రైతుల ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. 50 మందికిపైగా రైతులు ఫిర్యాదులు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పలువురికి గాయాలు



గాయపడ్డ విద్యార్థి

బోథ్: సొనాల గ్రామంలో గు రువారం కుక్కల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. నర్సయ్య, ఓ యువకుడితోపాటు పలువురిపై కుక్కలు దా డి చేసి గాయపర్చాయి. వారిని వెంటనే సొనాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి, పలువురిని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

భీంరావు సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అభివృద్ధికి మాజీ మంత్రి కోట్నాక్ భీంరావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని భీంరావు చౌక్ వద్ద మాజీమంత్రి కోట్నాక్ భీంరావు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. భీంరావు..ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలి గిరిజన శాఖమంత్రిగా పనిచేసి ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి కృషిచేశారని పేర్కొన్నారు. ఐటీడీఏతోపాటు గిడ్డంగులు ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. 33 ఏళ్ల తర్వాత ఆయన స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చి ఈప్రాంత ప్రజల ఆశీర్వాదంతోనే ఎమ్మెల్యేగా గెలిచానని పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ఐటీడీఏ, ఆశ్రమ పాఠశాలల ఏర్పాటుకు భీంరావు కృషి చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్, ఆత్రం భాస్కర్, కోట్నాక్ రమేశ్, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, విశంరావు, జిల్లామేడి దుర్గ పాల్గొన్నారు.

టీజీ సీడ్స్‌నే కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేశ్‌రెడ్డి

భైంసారూరల్: రైతులు టీజీ సీడ్స్‌నే కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వానల్‌పాడ్ రైతు వేదికలో ఆగ్రో డీలర్స్‌తో సమావేశం గురువారం ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రా నున్న యాసంగి సీజన్‌లో ఈ ప్రాంతంలో రైతులు టీజీ సీడ్స్ తయారు చేసి శెనగలు, వడ్లు కొ నుగోలు చేసేలా చూడాలన్నారు. టీజీ సీడ్స్ వి త్తనాలు నాణ్యమైనవిగా ఉంటాయని రైతుల కు అందుబాటు ధరల్లోనే విక్రయిస్తారని తెలి పారు. తెలంగాణ వ్యవసాయ వాతావరణానికి అనుగుణంగా రైతులకు అధిక దిగుబడులు ఇచ్చే పంట రకాలను ఉత్పత్తిచేసి ఆగ్రో డీలర్స్‌తో విక్రయిస్తున్నట్లు తెలిపారు. రైతుల సౌకర్యార్థం అన్ని మండలాల్లోని పీఏసీఎస్, డీసీఎంఎస్‌తోపాటు ప్రభుత్వరంగ డీలర్స్ వద్ద ఈ విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపా రు. విత్తన శుద్ధి చేసి ప్లాంట్లలో ప్యాకింగ్ ప్రాసెస్ నిపుణుల సమక్షంలోనే జరుగుతుందని పే ర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఏడీఏ వీణ, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, మాజీ ఎంపీపీ రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవసరమైన వనరులు అందిస్తాం



కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు

భైంసా: ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు అవసరమైన వనరులు అందిస్తామని వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో గురువారం ఇన్‌వెంటస్ క్యాపిటల్ పార్ట్‌నర్స్, కాకతీయ సాండ్ బాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. (కేఆర్ఈఎస్‌టీ) కన్వల్‌రేఖి రూరల్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అండ్ స్టార్టప్ సెంటర్ ఆధ్వర్యంలో ఆగస్టు 10 నుంచి నిర్వహిస్తున్న కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఉత్తర తెలంగాణకు చెందిన యువ విద్యార్థులు ఏడు బృందాలుగా ఏర్పడి తమ స్టార్టప్ ఆలోచనలను ప్యానెల్‌కు అందజేశారు. పవన్‌కుమార్, గణేశ్ పాండ్రా మిసా, సందీప్, వినోద్, సూర్యరాజ్ విద్యార్థుల బృందానికి ప్రథమ బహుమతి కింద రూ. 25వేలు, ఆదిత్య, తనుశ్రీ, సింధూజ, స్వర్ణలత కాన్సెప్ట్‌కి రూ.20వేల బహుమతి, శ్రవంత్, శ్రీపార్థరెడ్డి, సయ్యద్ సాహిద్, సర్వేశ్ విద్యార్థులకు తృతీయ బహుమతి రూ.15 వేలు అందించారు.